Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 185 | Tuesday : 01.07.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :185 | మంగళవారం 1 జూలై 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి సెల్ : 9440815774





# పాశమైలారంలో పేలిన రియాక్టర్

- ఫ్యాక్టరీ పేలుడులో 12 మంది మృతి
- శిథిలాల కింద మరికొంతమంది కార్మికులు!
- ఫ్యాక్టరీలో చెల్లాచెదురుగా పడిపోయిన కార్మికులు
- పేలుడు ధాటికి కుప్పకూలిన రియాక్టర్ షెడ్
- శిథిలాల కింద మరికొంతమంది కార్మికులు!
- పాశమైలారంలో పరిశ్రమ వద్ద ఉద్రిక్తత..
- భారీగా పోలీసులు మోహరింపు
- పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికుల కుటుంబాలు యత్నించాయి
- తమ వారి ఆచూకీ తెలపాలంటూ బంధువులు ఆవేదన

3

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

- పాశమైలారం ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..
- సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో భారీ పేలుడు ఘటన
- సిగాచీ రసాయన పరిశ్రమలో పేలిన రియాక్టర్
- ప్రమాదంలో 8 మంది కార్మికులు దుర్మరణం
- ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం, అధికారులకు ఆదేశాలు






# ‘మీకో దండం.. మీ పార్టీకో దండం’

- బీజేపీకి రాజాసింగ్ రాజీనామా
- రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా
- బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నా
- కానీ, నా మద్దతుదారుల్ని బెదిరించారు.
- నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదు.
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎంతో పోరాడాం.

## క్వాంటమ్ ఆవిష్కరణలకు

# ఆకాశమే హద్దు

- స్టార్టప్‌లు తరలిరావాలి: చంద్రబాబు
- అమెరికాలో సిలికాన్ వ్యాలీ
- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ
- వచ్చే జనవరి 1నాటికి రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ పార్కు
- ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ భాగస్వామ్యంతో ఏర్పాటు
- దీనికి అనుబంధంగా ఎకోసిస్టమ్ కూడా
- టెక్నాలజీ లేకుంటే యుద్ధాలూ చేయలేం!
- రాష్ట్రంలో డీప్ టెక్నాలజీ, ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు విస్తృత అవకాశాలు
- అంతర్జాతీయ సంస్థలు అందిపుచ్చుకోవాలి ఇప్పుడే పెట్టుబడులతో రావాలి: సీఎం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటమ్ టెక్నాలజీ కేంద్రంగా మార్చాలని సంకల్పించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. క్వాంటమ్ రంగంలో ఆవిష్కరణలకు ఆకాశమే హద్దుగా పేర్కొన్నారు. స్టార్టప్‌లకు విస్తృత అవకాశాలున్నాయని.. అవి తరలిరావాలని పిలుపిచ్చారు. అమెరికాలో సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు తమ లక్ష్యమన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి ఈ క్వాంటమ్ వ్యాలీ పార్కు ప్రారంభమవుతుందని చెప్పారు. దిగ్గజ సంస్థలైన ఐబీఎం, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ భాగస్వామ్యంతో రాష్ట్రప్రభుత్వం దీనిని ఏర్పాటు చేస్తోందన్నారు. క్వాంటమ్ వ్యాలీపై సోమవారం విజయవాడలో ఏర్పాటుచేసిన జాతీయ వర్క్‌షాపునకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులు, కేంద్రప్రభుత్వంలోని ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులో లేకపోతే.. యుద్ధాలు కూడా చేయలేని పరిస్థితి నెలకొందని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. అమరావతిని గ్లోబల్ క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని.. అధునాతన సాంకేతిక కేంద్రంగా మారుస్తామని, ఇక్కడకు తరలిరావాలని స్టార్టప్ కంపెనీలను ఆహ్వానించారు. - మిగతా3లో



## పాశమైలారం ఘటన బాధాకరం

- ప్రధాని నరేంద్ర మోదీ
- చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం
- క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను
- మృతుల బంధువులకు పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుండి రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా



## లలిత్‌మోదీకి సుప్రీంలో చుక్కెదురు

- చట్టం నిబంధనలను ఉల్లంఘించిన కేసులో లలిత్ మోదీకి ఈడీ రూ.10.65 కోట్ల జరిమానా
- బీసీసీఐ నిబంధనల ప్రకారం ఆఫీస్ బేరర్లు అధికారిక విధుల్లో ఉన్నప్పుడు సమస్య వస్తే ఆ సంస్థే వారికి నష్టపరిహారం చెల్లించాలి

# బీజేపీ హైకమాండ్ కీలక నిర్ణయం.. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు!

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు అనే సస్పెన్స్‌కు తెర
- మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు పేరు బీజేపీ అధిష్టానం ఖరారు చేసినట్టు సమాచారం.
- అధ్యక్ష ఎన్నికకు పెద్దగా పోటీ లేకుండానే.. అందరి సమ్మతితో ఎన్నిక జరిపే విధంగా హైకమాండ్ ఈ నిర్ణయం
- రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించిన అంశంపై పార్టీ నాయకత్వం ఇప్పటికే సన్నాహక సమావేశం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు అనే సస్పెన్స్‌కు తెరపడినట్టు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు పేరు బీజేపీ అధిష్టానం ఖరారు చేసినట్టు సమాచారం. ఈ మేరకు సోమవారం ఉదయం హైకమాండ్ నుంచి ఆయనకు ఫోన్ వచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం రెండు గంటలకు రామచందర్ రావు నామినేషన్ దాఖలు చేయనున్నారు. అధ్యక్ష ఎన్నికకు పెద్దగా పోటీ లేకుండానే.. అందరి సమ్మతితో ఎన్నిక జరిపే విధంగా హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. తెలంగాణలో బీజేపీలోని కీలక నేతలకు హైకమాండ్ నుంచి ఫోన్లు వచ్చినట్టు తెలుస్తోంది. ఉదయం 11 గంటలకు అధికారికంగా అధ్యక్ష అభ్యర్థికి సమాచారం ఇస్తామన్న హైకమాండ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అందరూ అందుబాటులో ఉండాలంటూ పలువురు నేతలకు సమాచారం ఇచ్చారు. దీంతో, సదరు నేతలంతా 11 గంటలకు వచ్చే కాల్ కోసం ఎదురు చూస్తున్నట్టు సమాచారం. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు సోమవారం - మిగతా3లో



## చైనీస్ కంపెనీతో ఒప్పందం..

హెచ్‌పీవీ9 వ్యాక్సిన్ ఉత్పత్తి చేయనున్న బయోలాజికల్ ఈ సంస్థ

## జిల్లా కోర్టుకు అడ్వకేట్ చంద్రశేఖర్‌తో కలిసి హాజరైన కుప్పం తెలుగుదేశంపార్టీ నాయకులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 30:**
వైకాపా ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులకు సోమవారం రోజు చిత్తూరుజిల్లా కోర్టుకు అడ్వకేట్ చంద్రశేఖర్‌తో కలిసి హాజరైన కుప్పం తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ శాసన మండలి సభ్యులు గౌనివారి శ్రీనివాసులు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, మాజీ జడ్పీటీసీ మునస్వామి, కౌన్సిలర్ జాకీర్, మంజు, చెక్కు నత్తం మణి, అప్పు ముకేశ్, మునెప్ప, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కుప్పం ఇన్చార్జిగా తులసీ నాథ్




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 30:**
భారతీయ జనతాపార్టీ కుప్పం నియోజక వర్గ ఇన్చార్జిగా బిజెపి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎస్ తులసీనాథ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలో బిజెపి పార్టీ సంస్థాగత వ్యవహారాలు, కార్యక్రమాలు నిర్వహణ బాధ్యతలను తులసీనాథ్‌కు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. కూటమి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు బిజెపి ప్రతినిధిగా తులసినాథ్ ఆహ్వానించాలని పేర్కొన్నారు.

# ఇంటింటికి కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం

# 2న వి.కోట నుంచి ప్రారంభం

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
ఏడాదికాలంలో ప్రభుత్వంచేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశ్యంతో చేపట్టదలచిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా విజయవంతం చేయాలని పలమనేరు శాసన సభ్యులు అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం సమన్వయ కమిటీ సభ్యులతో అయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రభుత్వం ఏర్పా టై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇప్పటి వరకు ప్రజలకు చేసిన సంక్షేమం అభివృద్ధి పై గ్రామ స్థాయిలోని ప్రజలకు తెలియజేయడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారించడమేకార్య క్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందుకోసం (కే ఎస్ ఎస్) కుటుంబ సాధికారిక సభ్యులుగా ఉన్న వారు బాధ్యత తీసుకొని పార్టీ రూపొందించిన ఫార్మట్ ప్రకారం వివరాలను పొందుపరచాల్సి ఉంటుందన్నారు. ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లాలన్నదే ముఖ్యమంత్రి ప్రధానలక్ష్యం. కాబట్టి పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికి సంక్షేమఫలాలు తప్పక అందేలా చూడాలన్నారు. బూత్ లెవల్ స్థాయిలో కనీసం రోజుకు 50 కుటుంబాలకు తగ్గకుండా ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించాల్సి



ఉంటుందని సూచించారు. ఇక ఈ కార్యక్రమం నియోజకవర్గంలోని వి.కోట మండలంలోని కొంగాటం పంచాయతీ నుంచి ఈ నెల 2న ప్రారంభించి ఏక కాలంలో అన్ని మండలాల్లో విజయవంతంగా సాగేలా చూడాలని కోరారు. అనంతరంకార్యక్రమ కార్యాచరణ పై నాయకులతో ఆయన చర్చించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఆర్వీ బాలాజీ, విజయభాస్కర్ రెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ, సోమశేఖర్ గౌడ్, ఆనంద, నాగరాజు రెడ్డి, కుట్టి, నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, రాంబాబు, గిరి, ప్రతాప్, బ్రహ్మయ్య, ఖాజా, నాగరాజు, చౌడప్ప, చాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## కావలి సోషల్ రిఫార్మర్స్ ఆధ్వర్యంలో సమావేశం




**కావలి, చిత్తూర్ ఎక్స్ ప్రెస్, జూన్ 30:**
కావలి సోషల్ రిఫార్మర్స్ ఆధ్వర్యంలో కావలి పట్టణం కృష్ణం రాజేశ్వరమ్మ టౌన్‌హాల్ నందు సోమవారం ప్రభుత్వ రిజిస్టర్ అయిన స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చ జరిగింది. సామాజిక, పర్యావరణ, విద్య, ఆరోగ్యం, పేదరిక నిర్మూలన, ప్రకృతి వైపరీత్యాల సహాయం వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించుటకు చర్చించుకోవడం జరిగింది. అంతేకాకుండా ప్రభుత్వ రిజిస్ట్రేషన్ అయినటువంటి స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ఎన్జీవో కాలనీ ఏర్పాటు చేయాలని అదేవిధంగా కావలి సోషల్ రిఫార్మర్స్ కు కార్యాలయం ఏర్పాటు చేయుటకు సంబంధిత అధికారులు మరియు ఎమ్మెల్యేను కలిసి చర్చలు జరపాలని అందరూ తీర్మానం చేశారు. పై సమావేశంలో ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ ఖాదర్ బీ, దిపూర్ పీపుల్స్ వాలెంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ చేవూరు చిన్న, రహీం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మొహమ్మద్ అబ్దుల్ అలీం, పరివర్తన సేవా సంస్థ చైర్మన్ ఎండీ.ఎఫ్. రహమాన్, టి.వి.ఎస్. మెమోరియల్ ట్రస్ట్ ఫౌండర్ తోట వెంకటేశ్వర్లు, గుడ్ మేన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సోమిశెట్టి బ్రహ్మయ్య, విజయభారత్ ట్రస్ట్ ఫౌండర్ కిరణ్, వి సేవా ఫౌండేషన్ చైర్మన్ వినయ్ కుమార్, కలాం ట్రస్ట్ ఫౌండర్ సాయి తేజ, గుడ్ హార్ట్ ఫౌండేషన్ ఫౌండర్ సాయి కుమార్, మీ కోసం సేవా సంస్థ ఫౌండర్ రాయపాటి దిలీప్ కుమార్, మార్గదర్శి ఆర్గనైజేషన్ ఫౌండర్ రామయ్య పాల్గొన్నారు.

## గణేష్ సేవలు మరువలేనిది

### ఏపీఎస్ఆర్టీసీ గణేష్ సేవలను గుర్తించి అవార్డులు రివార్డులు అందజేత



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
తన 39సంవత్సరాలలో మచ్చలేని మనిషిగా ఎదిగి ఏపీఎస్ఆర్టీసీకి గౌరవం తెచ్చిన వ్యక్తి ట్రావెలింగ్ టికెట్ చెకింగ్ ఇన్స్పెక్టర్ కొత్తపల్లి గణేష్. సోమవారం చిత్తూరు ఏపీఎస్ ఆర్టీసీ కార్యాలయంలో కొత్తపల్లి గణేష్, సమరపురి ఇరువురు పదవి విరమణ చేశారు. గణేష్ సబిత దంపతులను ఏపీఎస్ఆర్టీసీ అధికారులు బంధువులు స్నేహితులు సాలువ కప్పి పుష్పగుచ్చం అందించి ఘనంగా సన్మానం చేశారు. ఆయన ఏపీఎస్ఆర్టీసీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా చిత్తూరు డిపోస్క్వాడ్ ఇంచార్జ్ వసంతరావు మాట్లాడుతూ, 1987లో పుత్తూరు డిపోలో కండక్టర్‌గా 26 సంవ త్సరాలు సేవలందించి 2013లో పదివో న్నతపై అసిస్టెంట్ డిపో క్లర్కుగా ఐదు సంవత్సరాలు పనిచేసి 2018లో ట్రావెలింగ్ టికెట్ చెకింగ్ ఇన్స్పెక్టర్‌గా ఏడు సంవత్సరాలు కాలంలో అతను చేసిన సేవలను గుర్తించి పలుమార్లు రివార్డులు అవార్డులు అందుకున్నారు. గణేష్ తన 39 సంవత్సరం సర్వీసులో ఆర్టీసీలో ఎన్నో సేవలు చేశాడు మంచి వ్యక్తిగా బాధ్యతగల ఉద్యోగిగా పేరు తెచ్చుకున్నాడు ఇలాంటి వ్యక్తి మన అందరిలో ఉండి పదవి విరమణ చేసి మిగిలిన విశ్రాంతి సమయాన్ని సంతోషంగా గడపాలని ఆయన ను సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసన్, తిరుమలయ్య, ప్రభాకర్, కుమార్, శ్రీనివాసులు, ఉదయ్ ప్రకాష్, అంకిత, వినయ్, లత, కృపావతి తదితరులు పాల్గొన్నారు.

## చల్లాబాబు ఆశీస్సులు అందుకున్న పగడాల హరి రాయల్



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
చౌడేపల్లి సింగిల్ విండో అధ్యక్షుడిగా నియమితులైన పగడాల హరి రాయల్ సోమవారం పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీఇన్చార్జి చల్లా రామ చంద్రారెడ్డి ఆశీస్సులను అందుకున్నారు. ఈ మేరకు ఆయననివాసానికి వెళ్లిన హరి రాయల్‌ను చెల్లా బాబు ఆశీర్వదించారు. అదేవిధంగా రైతులకు అందుబాటులో ఉండి పార్టీని బలోపేతం చేస్తూరైతుల సమస్యలు పరిష్కరించాలని ఆయన సూచించారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ యొక్క విధివిధానాలను దిశానిర్దే శంచేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువనేత మాదిరాజు ప్రదీప్ రాజు సీనియర్ నాయకులు లక్ష్మణరాజు(పతి రాజు) కార్తీక్ రాయల్ సాగర్ నాయుడు రెడ్డి ప్రసాద్ ప్రహ్లాద చౌడేపల్లి మండలానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఈసెట్ కౌన్సిలింగ్ పై మాజీ సీఎం

## జగన్ ఎక్స్ ప్రకటన ఆశాస్పదం.

### టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు త్యాగరాజు

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 30:**



చిత్తూరు జిల్లా పలమనేరు నియోజక వర్గం వీకోట మండలం. సోమవారం రోజు చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడ మైనది. ఈ సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు త్యాగరాజు మాట్లాడు తూ గతంలో ఈసెట్ కౌన్సిలింగ్ ఎప్పుడు నిర్వహించారు మాజీ సీఎం జగన్‌కు తెలియడం లేదని, గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఈసెట్ కౌన్సిలింగ్ 2022 సెప్టెంబర్‌లో జరిగింది అని 2023లో జులై ఆఖరుకు కౌన్సిలింగ్ పూర్తి చేశారు. అది మీరు మరిచినారు అని గుర్తు చేశారు. అదే మా కూటమి ప్రభుత్వం వచ్చినాక మా నాయకుడు విద్యాశాఖ మంత్రి గౌరవ లోకేష్ బాబు ఇదే సంవత్సరం జూలై మూడో వారం లోపు ఈసెట్ కౌన్సిలింగ్ పూర్తి చేస్తామని ఇదివరకే లోకేష్ చెప్పడం జరిగిందని కానీ వైసిపి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వారి పాలనలో విద్యా రంగం నాశనమైందని విద్యారంగాన్ని జగన్ అస్తవేస్త చేసిన విద్యా వ్యవస్థను నారా లోకేష్ బాబు గాడిన పెడుతున్న విషయాన్ని చూసి జగన్మోహన్ రెడ్డి ఓర్వలేకపోతున్నాడని టిఎన్ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు త్యాగరాజు ఎద్దేవా చేసినాడు.

## పీలేరు సర్వేయర్‌గా రెడ్డి శేఖర్ బాబు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్30:**
అన్నమయ్యజిల్లా పీలేరుమండల సర్వేయర్‌గా ఏ రెడ్డి శేఖర్‌బాబు సోమవారం బాధ్యతులు స్వీకరించారు. ఇక్కడ సర్వేరుగా పని చేస్తున్న కీర్తన.కె.వి.పల్లెకు వెళ్లారు. ఆయన స్థానంలో, రాయచోటి కలెక్టరేట్లో సర్వేయర్ గాపని చేస్తున్న రెడ్డి శేఖర్‌బాబు పీలేరు వచ్చారు, తాసిల్దార్ ఎం శివ కుమార్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేశారు.

## తిరుపతిజిల్లా యూత్ సెల్ డైరెక్టర్ దావాల. వర్ధన్ నియామకం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 30:**



శ్రీకాళహస్తి ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుపతి జిల్లా యూత్ సెల్ డైరెక్టర్‌గా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన దావాల. వర్ధన్ నియ మితులయ్యారు. శనివారం ఆ సంస్థదక్షిణ భారత దేశ చైర్మన్ కుర్ర సూర్యనారాయణ నియామకపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వర్ధన్మాట్లాడుతూ ప్రజలకు అందు బాటులో ఉంటూ వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ పోలీస్ విజిలన్స్ డైరెక్టర్ పుల్లగూర అశోక్ కుమార్, ఏపీ స్టేట్ చైర్మన్ రామచంద్ర రెడ్డి, పాల్గొన్నారు.

## నెరవేరిన దశాబ్దాల దారిసమస్య

### పనులు చేపట్టాలని సూచించిన మండల తెదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
దశాబ్దాల తరబడి ఉన్న భక్తుల దారి సమస్య మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి చొరవతో తీరింది. చౌడేపల్లి మండలం చారాల పంచాయతీ జంగాలపల్లికి సమీపంలోని యోగ మల్లేశ్వర స్వామి ఆలయానికి దారి సమస్య ఉంది దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్వామి ఆలయానికి వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి చౌడేపల్లి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. దారితోపాటు ఆలయం వద్ద నీటి కోసం బోర్ డ్రిల్లింగ్ చేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు అధికారులకు పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో దశాబ్దాల తరబడి ఉన్న సమస్యలు పరిష్కరించబడ్డాయని భక్తులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీధర్ రాజు సుబ్రహ్మణ్యం రాజు భోయకొండ సుబ్బు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌లో మాస్టర్ ధనుష్‌కు డాక్టరేట్



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
శ్రీకాళహస్తిపట్నంలోని ముత్యాలమ్మ గుడి వీధిలోఉన్న కెన్ షేటో రియో కరాటేఇన్స్టి ట్యూట్ మాస్టర్ ధనుష్ కువాషింగ్టన్ డిజి టల్ యూనివర్సిటీ వారు 21 సంవత్సరాలు సాధనకు ఫలితంగా ఈరోజు డాక్టరేట్ సర్టిఫికెట్ను ప్రకటించారు. ఈ సందర్భంగా వారి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు చిరుసన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనుష్ మాట్లాడుతూ 21 సంవత్సరాల మార్షల్ ఆర్ట్స్ సాధనకు ఫలితం ఈ రోజున స్పోర్ట్స్ కోటాలో డాక్టరేట్ సర్టిఫికెట్ ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది, దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్య వాదాలు తెలుపుతూ, అలాగే నాకు శుభాకాంక్షలు తెలిపినమా విద్యార్థులు, తల్లి దండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. దీని తర్వాత మార్షల్ ఆర్ట్స్‌లో ఎన్నో విజయాలు సాధించి, మన దేశానికి మంచి పేరు తెస్తానని తెలిపారు.

## పెరుమాళ్ళపల్లిలో రమేష్ మృతదేహానికి నివాళులర్పించిన డాక్టర్ వెంకటప్రకాష్ కోలారు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 30:**
చిత్తూరు పుత్తూరు జాతీయరహదారి ఎస్ఆర్ పురం మండలం మర్రిపల్లి గ్రామం వద్ద స్కూటర్ఢీకొని మృతి, చెందిన పెరుమాళ్ళ పల్లి రమేష్ మృతదేహానికి నివాళులు అర్పించి. వారికుటుంబానికి తనవంతు చేయగలిగిన సాయం ఎల్లపుడు చేయడానికి సిద్ధంగా ఉంటానని జీడ నెల్లూరు వైస్సార్సీపీ వైద్య విభాగ అధ్యక్షులు, డాక్టర్ కోలారు వెంకట ప్రకాష్ భరోసా ఇచ్చారు.

## కుటుంబ సమేతంగా దర్శించుకున్న ప్రముఖ జ్యోతిష్యులు వేణుగోపాలస్వామి

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మ వార్ల ప్రముఖ జ్యోతిష్యులు వేణుగోపాల స్వామి కుటుంబసమేతంగా విచ్చేశారు. వీరికి ఈశ్వర్,సంపత్ స్వాగతంపలికారు. అనంతరంస్వామి అమ్మవార్ల ప్రత్యేకదర్శ నం ఏర్పాటుచేశారు.అనంతరంమేధా గురుదక్షిణామూర్తి సన్నిధానంవద్ద శేష వస్త్రంతో సత్కరించి వేదపండితులచే ఆశీర్వదించిస్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందచేశారు.

# ఆ గ్యాప్ కొనసాగుతూనే వచ్చింది. పార్టీకి ఇలా దూరం చేసింది!

రాజాసింగ్.. నిన్న మొన్నటి వరకూ బీజేపీలో ఓ సంచలనం. తెలంగాణలో బీజేపీ ఎదుగుదల కోసం కృషి చేసిన నాయకుల జాబితాలో రాజాసింగ్ కచ్చితంగా ఉంటారు. అయితే పార్టీకి ఉన్నపళంగా రాజీనామా చేశారు రాజాసింగ్. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఆశించి నామినేషన్ వేయడానికి బీజేపీ కార్యాలయానికి వచ్చిన రాజాసింగ్.. ఆపై కొద్ది సేపటికే పార్టీకి గుడ్ బై అంటూ ప్రకటించారు.

'మీకో దండం.. మీ పార్టీకో దండం' అని రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ' రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నా. కానీ, నా మద్దతుదారుల్ని బెదిరించారు. నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదు. వాళ్లు అనుకున్న వాళ్లకే పదవి ఇచ్చారు. అందుకే బీజేపీకి రాజీనామా చేస్తున్నా' అని రాజాసింగ్ ప్రకటించారు. అసలు బీజేపీ అధిష్టానంతో రాజాసింగ్‌కు గ్యాప్ ఎలా ఏర్పడింది.. ఎక్కడ ఏర్పడింది అనే అంశాల్లో కొన్నింటిని పరిశీలిస్తే..



### ఆనాటి గ్యాప్.. కొనసాగుతూనే వచ్చింది..!

రాజాసింగ్ అంటే బీజేపీ అధిష్టానానికి నమ్మకం. అది ఒకప్పుడు మాట. అది క్రమేపీ దూరం అయ్యింది. మూడేళ్ల క్రితం బీజేపీ అధికార ప్రతినిధి నుపూర్ శర్మ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రత్యక్షంగా మద్దతు ప్రకటించారు రాజాసింగ్. 2022లో నుపూర్ శర్మ ఇస్లాం మత ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారానికి దారితీశాయి. ఆ వ్యాఖ్యలపై ఆమెను బీజేపీ సస్పెండ్ చేసిన తర్వాత, రాజాసింగ్ ఆమెను సమర్థిస్తూ వీడియో విడుదల చేశారు. ఇది బీజేపీ అధిష్టానం వైఖరిని తప్పుబట్టినట్లయ్యింది. అధిష్టానాన్ని చాలెంజ్ చేసినట్లు ఉండటంతో రాజాసింగ్‌ను వివరణ ఇవ్వాలని కోరింది అధిష్టానం. ఈ క్రమంలోనే రాజాసింగ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. 2022 ఆగస్టు 23వ తేదీన రాజాసింగ్‌ను బీజేపీ సస్పెండ్ చేసింది. ఆ తర్వాత 2024 అక్టోబర్ 22వ తేదీన రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేయడంతో తిరిగి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దొరికింది రాజాసింగ్‌కు. అయితే అప్పట్నుంచి అధిష్టానంతో గ్యాప్ మాత్రం కొనసాగుతూనే వచ్చింది. 2024 ఎంపీ ఎన్నికల్లో బీజేపీ నుంచి హైదరాబాద్ ఎంపీగా ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోటీ చేయిస్తే అనూహ్య ఫలితాలు సాధించవచ్చనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా నడిచింది. అధిష్టానం రాజాసింగ్‌ను హైదరాబాద్ నుంచి పోటీ చేయించాలని చూసింది. ఇక్కడ రాజాసింగ్ మాత్రం ఎంపీగా విముఖత వ్యక్తం చేసిన కారణంగానే ఆయన మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేశారనేది మరో చర్చ. సస్పెన్షన్ గురైన సందర్భంతో పాటు తరచూ వివాదాలు కూడా రాజాసింగ్-అధిష్టానం మధ్య గ్యాప్‌కు కారణమైంది. ఇటీవల కాలంలో పార్టీ లైన్‌కు భిన్నంగా రాజాసింగ్ వ్యవహరించడంతో ఆయన్ను అధిష్టానం పెద్దగా పట్టించుకోలేదు. ప్రధానంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలకు సైతం రాజాసింగ్ మద్దతు పలికారు.

బీఆర్ఎస్-బీజేపీ మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయన్న కవిత వ్యాఖ్యలను రాజాసింగ్ సమర్థించారు. ఇవన్నీ కూడా అధిష్టానానికి కోపం తెప్పించాయి. రాజాసింగ్ రాజీనామా చేసే క్రమంలో అధిష్టానం పెద్దలు ఎవరూ కూడా ఆయన్ను బుజ్జగించే పని చేయకపోవడమే ఇందుకు ఉదాహరణ. ప్రధానంగా చూసుకుంటే 2022 నుంచే అధిష్టానంతో రాజాసింగ్‌కు సఖ్యత చెడిపోతూ వచ్చిందని, అదే ఇంతవరకూ తెచ్చిందనేది విశ్లేషకుల అభిప్రాయం.

### ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాపై బీజేపీ సీరియస్

**హైదరాబాద్:** బీజేపీకి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాపై ఆ పార్టీ స్పందించింది. మా పార్టీకి వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యం అంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. రాజాసింగ్ ఆరోపణల్లో నిజం లేదని.. రాజాసింగ్ క్రమశిక్షణా రాహిత్యం పరాకాష్టకు చేరిందంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. "రాజాసింగ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనుకుంటే స్పీకర్‌కు లేఖ ఇవ్వాలి. పార్టీ అధ్యక్షులకు ఇచ్చిన రాజీనామా లేఖను జాతీయ అధ్యక్షుడికి పంపిస్తున్నాం" అని బీజేపీ పేర్కొంది. కాగా, రాజాసింగ్ తీసుకున్న సంచలన నిర్ణయం.. తెలంగాణ బీజేపీలో కల్లోలం రేపుతోంది. బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా.. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నా.. కానీ, నా మద్దతుదారుల్ని బెదిరించారు. నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదు. వాళ్లు అనుకున్న వాళ్లకే పదవి ఇచ్చారు. అందుకే బీజేపీకి రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎంతో పోరాడాం. కానీ, పార్టీ అధికారంలోకి రాకూడదనే ఎక్కువ మంది కోరుకుంటున్నారు. బీజేపీ కోసం సర్వం ధారపోశాను. నేను, నా కుటుంబం టెర్రరిస్టుల టార్గెట్‌లో ఉన్నాం. పార్టీ కోసం ఇంత పని చేసినా ఏం లాభం?. అందుకే పార్టీకి లవ్ లెటర్ ఇచ్చి వెళ్తున్నా. మీకో దండం.. మీ పార్టీకో దండం. లక్షల మంది కార్యకర్తల బాధను ప్రతిబింబించే రాజీనామా ఇది(అంటూ లేఖను చూపించారాయన). బీజేపీకి రాజీనామా చేసినా.. హిందుత్వం కోసం పోరాడుతూనే ఉంటాను అని రాజాసింగ్ ప్రకటించారు.

# క్వాంటమ్ ఆవిష్కరణలకు ఆకాశమే హద్దు

-మొదటిపేజీ తరువాయి

'నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను కేంద్రం ప్రకటించిన వెంటనే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టే బాధ్యతను ఐబీఎం, ఎల్ అండ్ టీ, టీసీఎసకు అప్పగించాం. ఈ పార్కుకు అనుబంధంగా పూర్తిస్థాయి ఎకో సిస్టమ్‌ను ఏర్పాటుచేసి.. అన్నారు. 100కు పైగా మెథడాలజీ(యూజ్ కేస్)లను విశ్లేషణాత్మకంగా పరీక్షిస్తాం. అమరావతికి ఒక యంత్రాన్ని తీసుకొచ్చి క్వాంటమ్ కంప్యూటింగ్ వచ్చేసిందని అనుకోవడం లేదు. వివిధ ఉపకరణాల నుంచి రియల్ టైమ్ డేటా విశ్లేషణకు, వ్యవసాయంలో మట్టిలోని తేమ వంటి అంశాలను పరిశీలించడానికి క్వాంటమ్ కంప్యూటింగ్ అవసరం. క్వాంటమ్ టెక్నాలజీ, డీప్ టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ) ఇప్పుడు సరికొత్తసాంకేతిక విప్లవం. ఈ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని సానుకూలతలు ఉన్నాయి. రాష్ట్రంలో స్పేస్ సిటీ, స్పేస్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 15వ తేదీ నుంచి పౌరసేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తాం. పాలనలో పౌరుల నివాసాల జియో ట్యాగింగ్, సర్వీస్ డెలివరీ, ఆన్‌లైన్ ఫైళ్లు, క్లౌడ్ డేటాలను వినియోగిస్తున్నాం. క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీలో స్టార్ట్‌పలనూ చేరిస్తే అవకాశాలు విస్తృతమవుతాయి. ఇది సాంకేతికతను మరోస్థాయికి చేరుస్తుంది' అని వివరించారు. అమరావతి సహా ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమలు, స్టార్ట్‌పలను కోరారు. 'బహుళ జాతి సంస్థలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని భాగస్వాములు కావాలి. ఇప్పుడే పెట్టుబడులతో రావలసిన అవసరం ఉంది. భారత్‌లోనే ఉత్పత్తులను తయారుచేసి.. ఇక్కడి మార్కెట్‌ను వినియోగించుకోవాలి. రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచీ ఒక పారిశ్రామికవేత్తను తయారుచేయాలన్న లక్ష్యం పెట్టుకున్నాం' అని తెలిపారు.



### నాడు హైటెక్ సిటీని నిర్మించా..

పాలనలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం తీసుకురావడానికి ఐటీ ఒక్కటే మార్గమని దృఢంగా విశ్వసించానని సీఎం చెప్పారు. హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ నిర్మాణంతో బలమైన ఎకోసిస్టమ్‌ను సృష్టించామని.. ఫలితంగా ఇప్పుడు సైబరాబాద్ ప్రపంచ ఐటీ కేంద్రంగా మారిందని గుర్తుచేశారు. ఇప్పుడు తెలంగాణ ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోందన్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ కూడా దేశానికి మార్గనిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. తమ లక్ష్యాలను కేంద్రప్రభుత్వ సహకారంతో సాధిస్తామని వెల్లడించారు.

### క్వాంటమ్ విజన్ లక్ష్యాలను లోకేశ్ సాధించాలి..

లోకేశ్ ఐదో తరగతి చదువుతున్నప్పుడే తాను ఐటీ రంగాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించేందుకు కృషి చేశానని.. ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటింగ్ వచ్చేసిందని.. లోకేశ్ ఐటీ మంత్రి అయ్యారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అమెరికాలోని కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయంలో చదువుకున్న ఆయన.. ఇప్పుడు ఐటీ మంత్రిగా ఉండడం సంతోషదాయకమన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ విజన్ లక్ష్యాలను సాధించే బాధ్యతను ఆయనకు అప్పగించానని చెప్పారు. భవిష్యత్ పాలనకు క్వాంటమ్ కంప్యూటింగ్ దిక్సూచిగా పనిచేస్తుందన్నారు. తాను నిత్య విద్యార్థినని, భవిష్యత్ టెక్నాలజీని పాలనకు, అభివృద్ధికి సమ్మిళితం చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. ఈ వర్క్‌షాపులో కొత్త టెక్నాలజీ గురించి తెలుసుకునేందుకు 4 గంటల పాటు కొత్త అంశాలను రాసుకుంటూనే ఉన్నానని చెప్పారు. ఈ వర్క్‌షాపులో.. అమరావతిలో ఏర్పాటుచేసే క్వాంటమ్ కంప్యూటర్ నమూనాను ఐబీఎం ప్రదర్శించింది. దీనితో పాటు పలు క్వాంటమ్ టెక్నాలజీ స్టార్ట్‌పలను లోకేశ్‌తో కలిసి చంద్రబాబు పరిశీలించారు.




**సంగారెడ్డి:**

పటాన్‌చెరులోని పాశమైలారంలో పెనువిషాదం చోటుచేసుకుంది. సోమవారం సిగాచి రసాయన పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. మైక్రో క్రిస్టల్ సెల్యులోజ్ డ్రయింగ్ యూనిట్‌లో ఈ ఘటన జరిగింది. ఈ పేలుడు ఘటనలో37 మంది కార్మికులు మృతిచెందారు. వీటిలో నాలుగు మృతదేహాలను గుర్తించారు. ఇంకా కార్మికుల మృతదేహాలు గుర్తించాల్సి ఉంది. మృతులు, క్షతగాత్రులు బీహార్, ఒడిసా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాసులుగా గుర్తించారు. అయితే.. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు పలు ఆస్పత్రుల్లో 35 మంది కార్మికులకి చికిత్స అందిస్తుండగా, 11 మంది పరిస్థితి విషమంగా ఉంది. తెలంగాణ చరిత్రలోనే ఘోర పారిశ్రామిక ప్రమాదంగా అధికారులు చెబుతున్నారు. ఘటనాస్థలిలో సింగరేణి రెస్క్యూ టీం, ఎన్డీఆర్ఎఫ్, హైడ్రా, రెవెన్యూ, పోలీసుల సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## బీజేపీ హైకమాండ్ కీలక నిర్ణయం.. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు!

-మొదటిపేజీ తరువాయి

నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. అదేరోజు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు పరిశీలన, ఉపసంహరణకు అవకాశం కల్పించారు. జూలై 1వ తేదీన అధ్యక్ష ఎన్నిక, ప్రకటన ఉంటుంది. అధ్యక్ష ఎన్నిక ప్రక్రియలో 119 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, 38 జిల్లా శాఖల అధ్యక్షులు, 17 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులు పాల్గొంటారు. రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించిన అంశంపై పార్టీ నాయకత్వం ఇప్పటికే సన్నాహక సమావేశం నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా మన్నెగూడ సమీపంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్, సంస్థాగత ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తివారి తదితరులు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు.

## శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

-మొదటిపేజీ తరువాయి

ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. ఎల్బీ స్టేడియంలో జులై 4న ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను ఈరోజు (సోమవారం) కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. జూలై 4న ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం సభకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిట శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

## 'మీకో దండం.. మీ పార్టీకో దండం'

**హైదరాబాద్ :** తెలంగాణ బీజేపీలో రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల కల్లోలం రేపింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. చాలాకాలం తర్వాత బీజేపీ కార్యాలయానికి వచ్చిన ఆయన.. కాసేపటికే ఈ ప్రకటన చేయడం గమనార్హం. రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నా. కానీ, నా మద్దతుదారుల్ని బెదిరించారు. నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదు. వాళ్లు అనుకున్న వాళ్లకే పదవి ఇచ్చారు. అందుకే బీజేపీకి రాజీనామా చేస్తున్నా. రాష్ట్ర అధ్యక్షుడికి రాజీనామా లేఖ ఇవ్వడానికే వచ్చా. నాకు మద్దతుగా ముగ్గురు కౌన్సిల్ సభ్యులు కూడా రాజీనామా చేశారు. రాజాసింగ్ మా పార్టీ సింబల్ మీద గెలిచాడు ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్యే కాదని, సస్పెండ్ చేయాలని కిషన్‌రెడ్డే స్పీకర్‌ను కోరాలి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎంతో పోరాడాం. కానీ, పార్టీ అధికారంలోకి రాకూడదనే ఎక్కువ మంది కోరుకుంటున్నారు. బీజేపీ కోసం సర్వం ధారపోశాను. నేను, నా కుటుంబం టెర్రరిస్టుల టార్గెట్‌లో ఉన్నాం. పార్టీ కోసం ఇంత పని చేసినా ఏం లాభం?. అందుకే పార్టీకి లవ్ లెటర్ ఇచ్చి వెళ్తున్నా. మీకో దండం.. మీ పార్టీకో దండం. లక్షల మంది కార్యకర్తల బాధను ప్రతిబింబించే రాజీనామా ఇది(అంటూ లేఖను చూపించారాయన). బీజేపీకి రాజీనామా చేసినా.. హిందుత్వం కోసం పోరాడుతూనే ఉంటాను అని రాజాసింగ్ ప్రకటించారు.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

సంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ రసాయన పరిశ్రమలో సోమవారం ఘోర ప్రమాదం జరిగింది. పరిశ్రమలోని రియాక్టర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోవడంతో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే... పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. పేలుడు తీవ్రత ఎంత భారీగా ఉందంటే, ప్రమాద సమయంలో పనిచేస్తున్న కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం వరకు ఎగిరిపడ్డారు. ఈ పెను విస్ఫోటనానికి ఉత్పత్తి విభాగం ఉన్న భవనం పూర్తిగా కుప్పకూలింది. సమీపంలోని మరో భవనానికి కూడా బీటలు వారాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుని భయానక వాతావరణం నెలకొంది. ఈ దుర్ఘటనలో మొత్తం ఎనిమిది మంది కార్మికులు మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. వీరిలో ఐదుగురు ప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మరికొందరు కార్మికులు గాయపడినట్లు సమాచారం.

### సీఎం రేవంత్ రెడ్డి స్పందన

పాశమైలారం పేలుడు ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు. శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అవసరమైన అన్ని సహాయక చర్యలను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. గాయపడిన వారికి సాధ్యమైనంత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## ఒకే రూట్‌లో వెళ్లేవారుంటే.. వారికి ప్రత్యేక బస్సులు: మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్:** నగరంలో కొత్తకాలనీలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా కొత్త రూట్లలో ప్రయాణికుల సౌకర్యాలు పెంచేలా ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే రూట్‌లో వెళ్లే వారుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వారికి ప్రత్యేక బస్సులు వేస్తామని హామీ ఇచ్చారు. ముషీరాబాద్‌లో పదవీవిరమణ పొందుతున్న 14 మంది ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. వారి సేవల్ని కొనియాడారు. అంతకుముందు అధునాతన టెక్నాలజీ ద్వారా ఆర్టీసీ అమలు చేస్తోన్న డిజిటల్ పేమెంట్స్ అమలును మంత్రి పొన్నం పరిశీలించారు. రవాణా శాఖ చెక్‌పోస్టుల మూసివేత అంశం కేంద్రం ప్రతిపాదనలో ఉందని, దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఈవీ పాలసీ తీసుకొచ్చిందని, రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టులు సాంకేతికంగా అమలు చేసేలా మార్పులు చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో అనేక సంస్కరణలు, ఆర్టీసీ ఉద్యోగులకు సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ పాత బకాయిలు చెల్లిస్తూ, నూతన నియామకాలు చేపట్టామని, కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. ఆర్టీసీలో ఇప్పటి వరకు 191 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, వారి ప్రయాణం విలువ రూ.6,300 కోట్లు ఉంటుందని మంత్రి తెలిపారు.

# 11వ క్లస్టర్ ఇన్చార్జిగా కన్నన్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
కుప్పం నియోజకవర్గం 11వ క్లస్టర్ ఇన్చార్జిగా కన్నన్‌ను నియ మిస్తున్నట్టు టిడిపి వర్గాలు తెలిపాయి. గత సార్వత్రిక ఎన్నికలలో 11వ క్లస్టర్ పరిధిలో పార్టీ బలోపేతానికి కన్నన్ చేసిన కృషిని గుర్తించిన అధిష్టానం తనను ఇన్చార్జిగా నియ మించడం జరిగిందని స్థానిక టిడిపి నాయకులు తెలిపారు. కన్నన్ క్లస్టర్‌గా నియమితులైన సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో అభి నందనలు తెలిపారు. అనంతరం నూతన క్లస్టర్ ఇంచార్జ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నూతన పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు, జాతీయ ప్రధాన కార్య దర్శి నారా లోకేష్ బాబుకు, ఇందుకు సహకరించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు, ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావుకు, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంకు, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా తనకు అప్పగిం చిన పదవీ బాధ్యతలలో భాగంగా స్థానిక టిడిపి నాయకులను సమన్వయం చేసుకొని, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.



# ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక వాహనం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
కుప్పం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ ప్రత్యేక బైకును కేటాయించినట్లు డి.ఎస్.పి పార్థ సారథి తెలియజేశారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు112,100 నంబర్లకు వచ్చే ఫిర్యాదులకు వెంటనే అటెండ్ అవ్వడానికి ఈ బైకును కేటా యించినట్లు ఆయనతెలియజేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తితే వెంటనే వెళ్లి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు.

## పిహెచ్సి నందు డిజిటల్ నర్స్ సిస్టం

# పనితీరును విపులంగా పరిశీలించిన స్టేట్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి, కుప్పం నియోజకవర్గం నందు ప్రత్యేకంగా ప్రజల ఆరోగ్య నిమిత్తమై టాటా గ్రూప్ ఏర్పాటు చేసిన డిజిటల్ నర్స్ సిస్టం యొక్క పనితీరును స్టేట్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్ సోమవారం రోజు కుప్పం నియోజకవర్గంలోని విజాలాపురం పిహెచ్సి నందు డిజిటల్ నర్స్ సిస్టం యొక్క పనితీరును విపులంగా పరిశీలించారు. దీని ద్వారా ప్రజలకు ఏ విధంగా వైద్య సౌకర్యాలు క్వాలిటీగా అందుతాయి అనేదానిపై ప్రత్యక్షంగా పరిశీలించారు. కావున ప్రజలందరూ అభ ఐడి క్రియేట్ చేసుకుని ఈ క్వాలిటీ ఆరోగ్య సేవలను ఉచితంగా పొందవలెనని తెలిపారు. దీని ద్వారా దీర్ఘ కాలిక వ్యాధులు బిపి,షుగర్, గుండెజబ్బులు,క్యాన్సర్లు, థైరాయిడ్ లాంటివి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ దేవి, డీయెస్సీ ఐటీ మేనేజర్, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, స్థానిక డాక్టర్ పూజిత తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలపై నకిలీ స్టిక్కర్లు ఉంటే చర్యలు తప్పవు


## వాహనాల తనిఖీలలో సత్యవేడు ఎస్సై రామస్వామి



**సత్యవేడు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
వాహనదారులు వారి వాహనాలపై నకిలీ స్టిక్కర్లు ఉన్నట్లయితే చట్టప్రకారంచర్యలు తప్పవని తిరుపతిజిల్లా సత్యవేడు ఎస్ఐ రామస్వామి హెచ్చరించారు. జల ఎస్పీహర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు స్థానిక సీఐ మురళినాయుడు సూచనల మేరకు పోలీసులు నకిలీస్టిక్కర్లపై కొరడా ఝులిపించారు. ఇందులో భాగంగా సోమవారం సత్యవేడుపట్టణంలోని గాంధీవిగ్రహంవద్ద పలు వాహనాలను ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలువాహ నాలపై ఉన్న నకిలీ స్టిక్కర్లను పోలీసులు తొలగించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రామస్వామి మాట్లాడుతూ పోలీస్, ప్రెస్, రెవెన్యూ,అటవీ తదితర శాఖలకు సంబంధించి వారు అ%కాకుండా ఇతరులు వారి వాహనాలపై అనధికారికంగా స్టిక్కర్లు వేసుకుంటే చర్యలు ఉంటాయన్నారు. కేవలం ఆయా శాఖలకు సంబంధించిన ఉద్యోగులు మాత్రమే వారు వినియోగిస్తు న్న వాహనాలపై స్టిక్కర్లు వేసుకోవచ్చు అని అన్నారు.అలాగే పాత్రికేయులుగా పని చేయని వారు వారి వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లను వేసుకోకూడదు అన్నారు. తదనంతరం వాహనాల రికార్డులు కూడా పరి శీలించి కొందరికి జరిమానా విధించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పోలీసులు ఈశ్వర్ రెడ్డి, భాస్కర్, గురవయ్య తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన పి.వి.ఎన్.మాధవ్

**వెదురు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 30:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన పి.వి.ఎన్.మాధవ్‌ని వెదురుకుప్పం మండలం బిజెపి పార్టీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ చెంగారెడ్డి విజయవాడలోమర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. వెదురు కుప్పం మండలం బిజెపి ప్రధాన కార్యదర్శి టి బాలాజి రెడ్డి.

## బోడిరెడ్డి.కృష్ణారెడ్డి మృతి దేహానికి

# నివాళులర్పించిన టిడిపి నాయకులు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 30:**
వెదురుకుప్పం మండలం తిరుమలయ్య పల్లి పంచాయతీ గ్రామానికిచెందిన బోడి రెడ్డి. రామకృష్ణారెడ్డి నిన్నటి దినం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రాష్ట్ర ప్రభు త్వ విప్ స్థానిక ఎమ్మెల్యే డా.వి.యం. థామస్ ఆదేశాలమేరకు సోమవారంరోజు ఆయన మృతి దేహానికి నివాళి అర్పించి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తెలుగుదేశం పార్టీ తరపున కృష్ణా రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలు ఆదుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీఅధ్యక్షులు లోకనాథ్ రెడ్డి, టిడిపి మాజీమండల అధ్యక్షులు క్లస్టర్ ఇంచార్జి మోహన్ మురళి, గ్రామ కమిటీ అధ్యక్షులు రావిళ్ళ.దేవరాజుల నాయుడు, మాజీ సర్పంచ్ మొగిలయ్య, లోకనాథ్ రెడ్డి, శ్రీనాథరెడ్డి, హనుమంతు నాయుడు, కృష్ణారెడ్డి, తదితరులు నివాళులర్పించారు.

## తొట్టంబేడు తహసిల్దారుగా

# పి.భారతి బాధ్యతలు స్వీకరణ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 30:**
శ్రీకాళహస్తి తొట్టంబేడు తహసిల్దార్ పి భారతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. గతంలో ఇక్కడ తహసిల్దార్‌గా పనిచేసిన యు. మధుసూదన్ రావు సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి కలెక్టరేట్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో తిరుపతి కలెక్టరేట్లో ఏవోగా పనిచేస్తున్న పి. భారతి తొట్టంబేడు తహసిల్దారుగా బాధ్యతలు తీసుకున్నారు. అంతకముందు శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తహసిల్దార్ పి భారతి మాట్లాడుతూ కార్యాలయంలో నిరంతరము ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారం కోసం తన వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

# స్వప్న వైష్ణవి దేవిగా అమ్మవారు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 30:**
చౌడేపల్లి మండలం పుదీపట్ల గ్రామానికి చెందిన, స్వయంభు వైష్ణవి దేవి ఆలయంలో వారాహి దేవి నవరాత్రులలో 5వ రోజు నా స్వప్న వైష్ణవి దేవిగా దర్శనమిచ్చారు. ఈ అమ్మవారిని దర్శిం చుకున్న వారికి దుస్వప్న నివారణ, నిద్ర సమస్యలు నిర్మూలన, భూ గృహ సమస్యల పరిష్కారం జరుగును ఆలయ అర్చకురాలు శ్రావణి ఉదయాన్నే అమ్మవారికి పంచామృత అభిస్తేకాలు అనంతరం దర్శన భాగ్యం కల్పించారు. పుంగనూరు చౌడేపల్లి చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా పుంగనూరుకి చెందిన అనంత మహేష్ సరితలు వ్యవహరించారు.

# ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి




**జగిత్యాల :** ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని,ఇండ్ల స్థలాలు, పెన్షన్‌లు ఇవ్వాలని,స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకు అవకాశం కల్పించాలని ఉద్యమకారుల ఫోరం జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్డిఓ కార్యాలయం ఎదుట తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శాంతి యుత దీక్షలు చేపట్టారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించా లని కోరుతూ చేపట్టిన ఈ దీక్షా శిబిరాన్ని తెలంగాణ ఉద్యమ జెఏసి నాయకులు చుక్క గంగారెడ్డి, సిరిసిల్ల రాజేందర్ శర్మ లు సందర్శించారు. దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలియ పరచారు. దీక్షా శిబిరంలో కూర్చొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమకారులకు చేస్తున్న అన్యాయాలను, ఉద్యమ ఆకాంక్షలను ఈ చర్చించారు. దీక్షా శిబిరం ను ఉద్దేశించి చుక్క గంగారెడ్డి, సిరిసిల్ల రాజేందర్ శర్మ లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం ఉద్యమకారులు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు, రచయితలు అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ఉద్యమం పేరుతో గద్దె నెక్కిన గత ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించలేదన్నారు. ఉద్యమకారులను అండగా ఉంచుకొని గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నేటికీ ఉద్యమ కారులను గుర్తించక పోవడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు తగిన న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతగానో పోరాటాలు చేశామని, ఉన్న ఉపాధిని పోగొట్టుకొని, భార్యా పిల్లలను సైతం వదిలి పెట్టీ రోడ్లెక్కి ఉద్యమాలు చేయడంతోనే తెలంగాణ సాధ్యం అయిందన్నారు. అలాంటి ఉద్యమకారులకు ఎలాంటి గుర్తింపు గానీ, తగు ప్రభుత్వ సాయం గానీ అందించక పోవడం శోషనీయం అన్నారు. గత ఏడాది చేపట్టిన ప్రజా పాలనలో ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం నేటికీ ఆ ఊసే ఎత్తక పోవడం బాధాకరం అన్నారు. ఉద్యమకారులకు ప్రతి ఒక్కరికి పెన్షన్, ఇంటి స్థలాలు, గుర్తింపు కార్డుకు ఇవ్వాలని, ఆ స్థలాలలో ఇండ్ల నిర్మాణం కూడా ప్రభుత్వమే చేసి ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పదవులలో ఉద్యమకారులకు అవకాశం కల్పించాలని కోరారు. వెంటనే ఈ ప్రభుత్వం కూడా స్పందించి ఈ డిమాండ్లతో పాటు తెలంగాణ ఉద్యమ కారుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తగిన గుణ పాఠం చెప్పి తీరుతామని పేర్కొన్నారు.

## సంపాదకీయం

# రాజకీయాలలో చెరగని ముద్ర వేసిన పిడతల

ఆయన ఒక అరుదైన నాయకుడు. ఏకగ్రీవంగా శాసన మండలికి ఎన్నికైన వ్యక్తి. శాసన సభ, శాసన మండలి రెండింటికీ అధ్యక్షునిగా ఎన్నికైన అరుదైన, అపూర్వ రికార్డును సొంతం చేసుకుని సమర్థ వంతంగా ఉభయ సభలను నడిపి, సామర్థ్యాన్ని చాటి చెప్పిన ఘనుడు. పలు మార్లు జైలు శిక్ష అనుభవించిన ఉద్యమ కారుడు. ప్రావెన్షియల్ పార్లమెంటేరియన్. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ తొలి అధ్యక్షుడు. బహుభాషా కోవిదుడు. పాత్రికేయుడు. ఆయనే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో తనదైన ముద్ర వేసిన పిడతల రంగారెడ్డి. పిడతల రంగారెడ్డి (నవంబర్ 10, 1917 – జూలై 1, 1991), ఆంధ్రప్రదేశ్ కు చెందిన రాజకీయ నాయకుడు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకరు, శాసనమండలి అధ్యక్షుడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండు సభలకు (శాసనసభ, శాసనమండలి) అధ్యక్షుడిగా పనిచేసిన ఏకైక వ్యక్తి. గిద్దలూరు శాసనసభ నియోజక వర్గం నుండి నాలుగుసార్లు శాసన సభకు ఎన్నికయ్యారు. గిద్దలూరు శాసనసభ నియోజవర్గం ఏర్పడక ముందు 1952లో తొలిసారిగా కంభం శాసనసభ నియోజవర్గం నుండి గెలిచి శాసనసభ సభ్యుడయ్యారు. పిడతల రంగారెడ్డి... ప్రకాశం జిల్లా, రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన పిడతల వెంగళరెడ్డి, పిచ్చమ్మలకు 1917, నవంబర్ 10న రంగారెడ్డి జన్మించారు. 1937లో కొత్తపట్నంలో కాంగ్రేసు పార్టీ సోషలిష్టు విభాగం నేతృత్వంలో జరిగిన రాజకీయ పాఠశాలలో శిక్షణ పొందారు. 1939లో గిద్దలూరులో వ్యక్తిగత సత్యాగ్రహంలో పాల్గొని ఐదు వందల రూపాయల జరిమానా చెల్లించడంతో పాటు ఆరు నెలల జైలు శిక్ష అనుభవించారు. 1940 కర్నూలు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, సత్యాగ్రహంలో పాల్గొని జరిమానా చెల్లించటంతో పాటు జైలు శిక్షను కూడా అనుభవించారు. 1941లో కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, 500 రూపాయలు జరిమానా తో బాటు 3సంవత్సరముల జైలు శిక్ష అనుభవించారు. 1950వ సంవత్సరములో మద్రాసు శాసనసభ నుండి ప్రావెన్షియల్ పార్లమెంట్‌కు ఎన్నికైనారు. విశాలాంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత పిడతల రంగారెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తొలి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1952–1959 వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా వ్యవహరించారు. పిడతల 1952వ సంవత్సరములో ఉమ్మడి మద్రాసు శాసనసభకు నేటి ప్రకాశం జిల్లా కంభం నియోజకవర్గం నుండి ఎన్నికైనారు. 1955వ సంవత్సరములో గిద్దలూరు నియోజకవర్గం మండి ఆంధ్ర శాసనసభకు శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. ఆయన దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో 1960వ సంవత్సరం జనవరి 11వ తేదీ నుండి 1962వ సంవత్సరం మార్చి 11వ తేదీ వరకు ప్రణాళిక అభివృద్ధి, పంచాయతీరాజ్, సమాచార, ప్రచారం, పర్యాటక శాఖ మంత్రిగా పనిచేసారు. ప్రణాళిక శాఖా మంత్రిగా ఆయన చేపట్టిన కార్యక్రమాలు, ఆ శాఖను ఆయన నడిపించిన తీరు తెన్నులు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొంది ఆంధ్రప్రదేశ్ గౌరవ ప్రతిష్టలను ఇనుమడింప చేసాయి..ఒకప్పటి పాత్రికేయుడిగా, ప్రతిరోజూ ఒక ప్రెస్‌నోట్‌తో పాత్రికేయులకు బాగా పని కల్పించేవారు. భాషావేత్త అయిన రంగారెడ్డి ఇంగ్లీషు, తమిళం, తెలుగు, హిందీ, ఉర్దూలలో అనర్గళంగా మాట్లాడేవారు. 1968వ సంవత్సరములో స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి విధాన పరిషత్తుకు పోటీ లేకుండా ఎన్నికైన రంగారెడ్డి 15.07.1968 నుండి 13.03.1972 వరకు విధాన పరిషత్తు చైర్మన్ గా పనిచేశారు. ఆయన విధాన పరిషత్తు చైర్మన్ గా సభా కార్యక్రమాలను నడిపించిన తీరు, ఆవలంభించిన విధానాలు, అన్ని పక్షాల సభ్యుల మన్ననలు, ప్రశంసలను పొందాయి. 1970వ దశకపు చివర్లో ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ మూడు వర్గాలుగా చీలిపోయినప్పుడు, ఇందిరా గాంధీకి ససేమిరా మద్దతును ఇవ్వకూడదని నిశ్చయించుకొని, పిడతల రంగారెడ్డి తన వర్గంతో అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న జనతా పార్టీలో చేరారు. 1972వ సంవత్సరములో గిద్దలూరు నియోజకవర్గం నుండి ఐదవ శాసనసభకు ఎన్నికైన ఆయన, 1972–1974 సంవత్సరాల మధ్య కాలంలో స్పీకరుగా పనిచేసి ఆ పదవికి కీర్తి ప్రతిష్టలు తీసుకు వచ్చారు. జలగం వెంగళరావు మంత్రి వర్గంలో రంగారెడ్డి ఆర్థిక, వాణిజ్య పన్నులు గృహనిర్మాణం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేసారు. ఆయన 1978వ సంవత్సరము ఆరవ శాసనసభకు, 1985వ సంవత్సరము ఎనిమిదవ శాసనసభకు గిద్దలూరు నియోజకవర్గం మండి ఎన్నికైనారు. 1985 ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు తెలుగుదేశం పార్టీ ఆయనకు మద్దతునిస్తూ గిద్దలూరు శాసనసభా నియోజక వర్గంలో అభ్యర్థిని నిలబెట్టలేదు. ఆ ఎన్నికలలో గెలిచిన రంగారెడ్డి, ఆ తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి, మరణించే దాకా తెలుగుదేశం లోనే కొనసాగారు. 1985వ సంవత్సరములో ప్రోటెం స్పీకరుగా బాధ్యతలను నిర్వహించారు. శాసనసభకు మంత్రి మండలి సమిష్టి బాధ్యత వహించే పేరుతో ఒక మంత్రి తరపున వేరొక మంత్రి సమాధానాలు ఇవ్వడం, ముఖ్యమంత్రి పేరున వున్న సభా కార్యక్రమాన్ని ఇతర మంత్రులు నిర్వహించడం ఒక అలవాటుగా మారకూడదని అనివార్య కారణాల వల్లనో లేదా కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగానే ఆ విధంగా చేయాలని పేర్కొంటూ 1974 జనవరి 23వ తేదీన పిడతల రంగారెడ్డి స్పష్టంగా రూలింగు ఇచ్చి తమ వ్యక్తిత్వాన్ని చాటి చెప్పారు. రంగారెడ్డి, 1969లో ట్రినిడాడ్, టుబాగో, 1971లో మాల్నాయ్ దేశాలలో జరిగిన కామన్ వెల్త్ పార్లమెంటరీ సదస్సులలో పాల్గొన్నారు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ రష్యా మొదలైన దేశాలలో పర్యటించారు. విధాన పరిషత్తు చైర్మన్ గా, శాసనసభ స్పీకరుగా ఎంతోమందికి ఆదర్శ ప్రాయులైన పిడతల రంగారెడ్డి 1991 సంవత్సరము జూలై ఒకటవ తేదీన మరణించారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143